క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఐడీపీఎల్, ప్రకాష్‌నగర్, లోధా, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూసాపేట హెచ్‌పీరోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్ ఏరియా, అశ్విని హెయిర్ ఆయిల్ లేన్, శక్తినగర్, మూసాపేట క్రాస్ రోడ్డు, మూసాపేట, ఆల్‌నబా హోటల్, బేగంపేట ఎరుకల బస్తీ, మెజిస్టిక్ మాన్షన్, జాగృతి అపార్ట్‌మెంట్స్, ఆర్‌బీఐ లేన్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ ఏరియా, అల్లావుద్దీన్ కోఠి, లిక్కర్ కంపెనీ, ఉమానగర్, వామన్‌నాయక్ లేన్, చిన్మయ స్కూల్, ట్రాన్సిస్ట్ హాస్టల్ ప్రాంతాల్లో ఉండదన్నారు.

నేడు థ్రిల్ సిటీలో కేటీఆర్ జన్మదిన వేడుకలు

సనత్‌నగర్: రాష్ట్ర మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను నెక్లెస్ రోడ్డు (పీవీమార్గ్)లోని థ్రిల్ సిటీ థీమ్ పార్కులో సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ తెలిపారు. వేడుకల్లో భాగంగా 3–డీ స్క్రీన్‌పై వినూత్నంగా కేటీఆర్‌కు బర్త్ డే శుభాకాంక్షలు తెలియజేస్తారన్నారు. ప్రపంచ రికార్డు సాధించిన కుట్టి చే రూబిక్స్ క్యూబ్ ఆర్టిస్ట్‌తో కేటీఆర్ భారీ విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందని కేటీఆర్ వ్యక్తిత్వం, పోరాట పటిమ, సాధించిన విజయాలను వివరిస్తూ ప్రత్యేక పాట ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా వివిధ టీవీ చానళ్లకు చెందిన వీడియో కెమెరా మెన్‌లకు ఉచితంగా ఏడాది పాటు వర్తించేలా హెల్త్ ఇన్స్యూరెన్స్ పత్రాలను అందజేస్తారన్నారు.

సీపీఎం నాయకుడు నర్సింగ్‌రావు మృతి


నర్సింగ్‌రావు

బన్సీలాల్‌పేట్: సీపీఎం నాయకులు నర్సింగ్ రావు (84) ఆదివారం మరణించాడు. గత కొంత కాలం నుంచి తీవ్ర అస్వస్థతతో బాధ పడుతున్న నర్సింగ్‌రావును కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. బోయిగూడ ప్రాంతంలో సీపీఎం నర్సింగ్‌రావుగా పేరుగడించిన ఆయన పేదలు, కార్మిక, కర్షకుల పక్షాన పోరాడారు. డీవైఎఫ్ఐ, సీఐటీయూల్లో పని చేశారు. ఆయన మరణవార్త తెలియగానే వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున బోయిగూడలోని ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సీపీఎం నాయకులు శ్రీనివాస్, సోమయ్య, మహేష్, రమేష్‌లతో పాటు స్థానిక నాయకులు లక్ష్మీపతి, ఆనంద్ యాదవ్, సునీల్, కుమార్ యాదవ్, బాలక్రిష్ణ తదితరులు నర్సింగ్‌రావుకు నివాళులర్పించారు.

ఓయూ వీసీ, రిజిస్ట్రార్‌కు మైనార్టీ కమిషన్ లేఖలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవిందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ రేపు (25న) హాజరుకావాలని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ లేఖ జారీ చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం తనకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛన్, ప్రొఫెసర్ హోదా వేతనం కోసం ఐదు నెలలుగా ఎదురు చూస్తున్నాని జరిగిన జాప్యం, అన్యాయంపై మైనార్టీ కమిషన్‌ను ప్రొ.అన్సారీ ఫిర్యాదు చేశారు. ప్రొ.అన్సారీ ఫిర్యాదు మేరకు స్పందించిన మైనార్టీ కమిషన్ చైర్మన్ ఓయూ అధికారులను వివరణ కోరగా ప్రొ.అన్సారీకి సంబంధించిన దస్త్రాలను సమర్పించారు. వాటితో సంతృప్తి చెందని మైనార్టీ కమిషన్ పూర్తి సమాచారంతో ఈ నెల 25న హాజరుకావాలని వీసీ, రిజిస్ట్రార్లకు లేఖలు జారీ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షురాలు నాగేంద్రమ్మ నివాసంలో ఐ.ఎ ఫ్.ఎస్.మాజీ అధికారి సాయి ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో అధ్యక్షులుగా సతీష్, కార్యదర్శిగా వైష్ణవి, కోషాధికారి ఫణి ఎన్నికైనట్లు తెలిపారు. అందరం కలిసి కట్టుగా ఉండి స్థానిక సమస్యలు పరిష్కరించుకుంటామని అధ్యక్ష, కార్యదర్శులు చెప్పారు. సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులకు రాయల సేవాసమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్, సభ్యులు చెన్నయ్య, ఆంజనేయులు అభినందనలు తెలిపారు.

అందుబాటులో అధికారులు..

పౌర సేవలకు పరుగులు

- చిన్న సమస్యలకు సత్వర పరిష్కారం
- వార్డు కార్యాలయాలకు స్పందన
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


సీతాఫల్‌మండి వార్డు కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

సికింద్రాబాద్: గతంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో మాత్రమే అందుబాటులో ఉండే పౌరసేవల కేంద్రం తాజాగా అన్ని డివిజన్లకు అందుబాటులోకి వచ్చింది. సిటిజన్ చార్టర్ కేంద్రంలో కేవలం జీహెచ్‌ఎంసీ సేవలు మాత్రమే అందుబాటులో ఉండేవి. పరిపాలన వికేంద్రీకరణ, ప్రజల వద్దకు పాలన ప్రాతిపదికన గతనెలలో అందుబాటులోకి వచ్చిన వార్డు కార్యాలయాల్లో పలు ప్రభుత్వ విభాగాల సేవలను అందుబాటులో ఉంచారు. జీహెచ్‌ఎంసీతో పాటు జలమండలి, విద్యుత్ విభాగాల సేవలను వార్డు కార్యాలయాల్లోకి తీసుకువచ్చారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో వార్డు కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. అడ్డగుట్ట, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాళ్లలో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేశారు. తార్నాక వార్డు కార్యాలయాన్ని మాత్రం కొద్ది సంవత్సరాల క్రితం నిర్మించి నిరుపయోగంగా ఉంటున్న శాంతినగర్ మార్కెట్ భవనంలో ఏర్పాటు చేశారు.

మధ్యాహ్నం నుంచి కార్యాలయాల్లో..

రోడ్లపై గుంతలు, మ్యాన్‌హోల్ మరమ్మతులు, దోమలమందు పిచికారీ, పేరుకుపోతున్న చెత్త, నాలాల్లో చెత్త తొలగింపు, కళేబరాల తొలగింపు, భవన నిర్మాణపు వ్యర్థాల తొలగింపు తదితర చిన్న చిన్న సమస్యలకు ప్రజలు ఫిర్యాదు చేసిన ఒకటి, రెండు రోజుల్లోనే పరిష్కారం లభిస్తుంది. చిన్నపాటి సమస్యల పరిష్కారంతో పాటు నిధుల కేటాయింపుతో జరిగే అభివద్ధి పనులకు సంబంధించిన సమస్యలు కూడా స్వీకరిస్తున్న వార్డు కార్యాలయ అధికారులు వాటికి సంబంధించిన ప్రగతి వివరాలను సంబంధిత ప్రాంతాల ప్రజలకు చేరవేస్తున్నారు. ఉదయం విధులు, పర్యటనల్లో ఉంటున్న అధికారులు మధ్యాహ్నం మాత్రం వార్డు కార్యాలయాలకు చేరుకుంటున్నారు. ఉదయం నుంచి అందిన ఫిర్యాదులపై పరిపాలన అధికారితో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇదే సమావేశంలో పరిష్కారానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటున్నారు.

పరిపాలన అధికారుల నేతృత్వంలో..

ఐదు వార్డు కార్యాయాల్లో ముగ్గురు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, ఇద్దరు సూపరింటెండెంట్‌లను పరిపాలన అధికారులుగా నియమించారు. పరిపాలన అధికారులకు ప్రత్యేక ఛాంబర్లు, రిసెప్షన్ కౌంటర్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. వివిధ విభాగాల అధికారుల కోసం అవసరమైన ఫర్నీచర్, కంప్యూటర్లను సమకూర్చారు. ఏఎంసీ స్థాయి అధికారుల నేతత్వంలో అన్ని విభాగాల అధికారులు ఒకే చోటు అందుబాటులో ఉంటుండడం, స్వీకరిస్తున్న ఫిర్యాదులకు నిర్ణీత గడువులో పరిష్కారం లభిస్తుంది. దీంతో ప్రభుత్వ సేవలు వినియోగించుకునేందుకు వార్డు కార్యాలయాలకు వస్తున్న పౌరుల సంఖ్య పెరుగుతుంది.

సేవల విస్తరణ..

గత నెలలో ప్రారంభించిన వార్డు కార్యాలయాలు ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్నాయని ప్రభుత్వ విభాగాల అధికారులు చెబుతున్నారు. వార్డు కార్యాలయాల ద్వారా అందుతున్న సేవల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వార్డు కార్యాలయాల్లో అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఆయా విభాగాల అధికారులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రానున్న రోజుల్లో వార్డు కార్యాలయ సేవలను మరింత విస్తృతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడిస్తున్నారు.

డివిజన్	వార్డు కార్యాలయం	అధికారి, ఫోన్ నెంబర్
1.అడ్డగుట్ట	మున్సిపల్ క్వార్టర్స్ కమ్యూనిటీహాలు తుకారాంగేట్	కే.సౌజన్య, సూపరింటెండెంట్ 8008103625
2. తార్నాక	శాంతినగర్ మోడల్ మార్కెట్ భవనం	ఆర్.హేమలత, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ 9912717615
3.మెట్టుగూడ	జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం న్యూ మెట్టుగూడ	చిత్రాని సర్కి సూపరింటెండెంట్ 9704289546
4.సీతాఫల్‌మండి	బీదలబస్తీ కమ్యూనిటీహాలు నామలగుండు	సంధ్యరాణి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ 9866795036
5.బౌద్ధనగర్	జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్ బౌద్ధనగర్	ఎండీ ఓమర్ అహ్మద్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ 9885538102

లక్ష్యాలను ఛేదించడంలో కేటీఆర్ స్ఫూర్తిదాయకం


పాటల సీడీని విడుదల చేసిన మంత్రి తలసాని

సనత్‌నగర్: పట్టుదల, కృషితో లక్ష్యాలను ఏ విధంగా సాధించవచ్చో కేటీఆర్‌ను చూస్తే అర్థమవుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కేటీఆర్ బర్త్ డే సందర్భంగా ఎస్‌ఆర్‌ఐ చాడ సృజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక రూపొందించిన ×జయహో రామన్న× సాంగ్‌ను ఆదివారం ఆయన కార్పొరేషన్ చైర్మన్లు అనిల్‌కుమార్, ప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ బిగాల మహేష్ గుప్తాలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటు, ఐటీ రంగ అభివృద్ధికి కేటీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. దేశ విదేశాల్లో విస్తృతంగా పర్యటించి రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేలా ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున వివిధ రకాల నూతన పరిశ్రమల ఏర్పాటుతో లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందిన గొప్ప నాయకులు కేటీఆర్ అని పేర్కొన్నారు.

'బీజేపీ హయాంలో మహిళలకు రక్షణ లేదు'


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: మణిపూర్‌లో మహిళలపై జరిగిన అమానవీయ ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ట్యాంక్‌బండ్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపు మేరకు డాక్టర్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు. వి వాంట్ పీస్ ఇన్ మణిపూర్ అంటూ నినాదాలు చేస్తూ నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గతంలో మణిపూర్‌లో హింసా సంఘటనలు, ఆ తర్వాత మహిళలపై వరుస అమానుష సంఘటనలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని విమర్శించారు. కేవలం ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ప్రజలపై ప్రేమ ఒలకబోస్తున్నట్లు నటించడమే తప్ప బీజేపీకి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, కమల్‌రాజ్, ప్రతాప్‌నాయక్ శ్రీనివాస్‌గౌడ్, ఆకుల రామచందర్, మణిమాల, సోఫియా, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నిరసన..

లాలాపేట: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆదివారం తార్నాక చౌరస్తాలో ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బెజ్జాల కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సమాజం సిగ్గుపడేలా ఆ రాష్ట్రంలో మహిళను వివస్త్రను చేస్తూ ఊరేగించడాన్ని మానవతా వాదులంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. దీనికి కారణం ఆ రాష్ట్ర ప్రభుత్వానిదే అని నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలన్నారు.

రాజెల్లయ్య సేవలు చిరస్మరణీయం


రాజెల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బన్సీలాల్‌పేట్: ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి రాజెల్లయ్య మాదిగ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం నిర్వహించిన రాజెల్లయ్య మాదిగ ప్రథమ వర్ధంతిలో కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, నాయకులు రాజశేఖరరెడ్డి, శ్యాంసుందర్ గౌడ్, మర్రి శశిధర్‌రెడ్డి, సురేష్, రాజు, సుదర్శన్‌బాబు, రాపాక అశోక్, మహేందర్, లక్ష్మీపతి, రాజేందర్, బి. మహేష్, శ్రీనివాస్, కేఎం క్రిష్ణ, గోవింద్ నరేష్ మాదిగ, తిప్పారపు లక్ష్మణ్, సుంచు అశోక్, శేఖర్, అశోక్ మాదిగ, డప్పు మల్లికార్జున్, రాజు, గండి క్రిష్ణ పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. బన్సీలాల్‌పేట్‌లో పేదల హక్కులు, సంక్షేమంతో పాటు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. విలువలు, విశ్వసనీయతతో పాటు ఆత్మగౌరవంతో జీవితాన్ని కొనసాగించారని గుర్తు చేశారు.

పచ్చని చెట్లపై గొడ్డలి పెట్టు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని మంజు థియేటర్ ప్రాంతంలో ఓ భవన యజమాని తన భవనానికి అడ్డుగా వస్తుందని ఓ భారీ వృక్షాన్ని నరికివేయించాడు. మరో చెట్టు కొమ్మలు కొట్టడంతో పాటు మొత్తాన్ని పెకిలించి వేసేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. మంజు థియేటర్ ఎదురుగా సింధీ బేకరీ ప్రాంతంలో ఇటీవల ఓ బిల్డర్ బహుళ అంతస్తు భవనాన్ని నిర్మించాడు. అయితే ప్రధాన రహదారి నుంచి ఈ భవనానికి ఓ భారీ వృక్షం అడ్డుగా ఉందని భావించి ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తుండటంతో రాత్రికి రాత్రే ఆ భారీ వృక్షాన్ని తొలగించి వేశాడు. అంతటితో ఆగకుండా అక్కడే ఉన్న మరో చెట్టు కొమ్మలు తొలగించాడు. అయినా అతని భవనం పూర్తిగా కనిపించడం లేదని భావించి ఆ చెట్టును కొట్టాలని భావించాడు. అయితే దాన్ని గమనించిన స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో రెండవ చెట్టు మిగిలింది.

లేని భూమిని సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించారు

ముగ్గురిపై కేసు నమోదు

అమీర్‌పేట: లేని భూమిపై పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించిన వ్యక్తులపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ సుందర్‌నగర్ కాలనీలోని సాయి అరుణోదయ అపార్ట్‌మెంట్స్‌లో ఉండే రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అనే మధ్యవర్తి ద్వారా సంగారెడ్డికి చెందిన లింగాల సాయి, లింగాల రాముకు రూ.72 లక్షలు ఇచ్చాడు. అందుకు గాను 2021లో సంగారెడ్డిలో 600 గజాల స్థలాన్ని ముద్దత్ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగ్గా బెదిరించడంతో రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చిన స్థలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ స్థలం లేదు. తనకు లేని భూమిపై నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారంటూ రాజగోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ రెడ్డితో పాటు సాయి, రాములపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చర్మ సౌందర్యానికి ప్రాధాన్యం

'కిమ్స్' ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

రాంగోపాల్‌పేట్: సినీ తారల నుంచి సామాన్యుల వరకు చర్మ సౌందర్యానికి నేడు అధిక ప్రాధాన్యమిస్తూ చర్మ శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారని కిమ్స్ ఆస్పత్రి ఎండీ, చైర్మన్ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ ఆస్పత్రి ఆడిటోరియంలో టీఎస్ఐఏడీవీఎల్, కిమ్స్ డెర్మటాలజీ విభాగం సంయుక్తంగా నిర్వహించిన డెర్మోటో సదస్సులో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 400 మంది డెర్మటాలజిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ.. చర్మ సౌందర్యం కోసం ఈ మధ్యకాలంలో శస్త్ర చికిత్సలు చేయించుకునే వారి సంఖ్య పెరిగిపోయిందని, ఈ శస్త్ర చికిత్సల్లో వస్తున్న అధునాతన పద్ధతులపై వైద్యులకు అవగాహన ఉండాలని సూచించారు. ఇలాంటి సదస్సులు డాక్టర్ల నైపుణ్యం పెంచుకునేందుకు ఎంతో దోహదపడతాయని అన్నారు. కిమ్స్ ఆస్పత్రి డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆనంద్ కుమార్ వగ్గు మాట్లాడుతూ.. మొట్టమొదటి సారిగా లైవ్‌లో చర్మ సౌందర్యానికి సంబంధించిన శస్త్ర చికిత్సలు చేశామని సదస్సుకు వచ్చిన వైద్యులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వెటిలిగో సర్జరీ, హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, అకినెల్కార్, సర్జరీ, నెయిల్ సర్జరీలు లైవ్‌లో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఐఏడీవీఎల్ అధ్యక్షులు డాక్టర్ అనూప్‌కుమార్ లహరి, కార్యదర్శి డాక్టర్ ఇందిరా, ఎస్ఐజీ కన్వీనర్ డాక్టర్ నితిన్ జైన్, కో ఆర్డినేటర్ డాక్టర్ యోగేష్ పాల్గొన్నారు.

బోనం.. వైభవం




అమ్మవారిని దర్శించుకున్న బోర్డు సీఈవో మధుకర్ నాయక్, మర్రి రాజశేఖర్ రెడ్డి


అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం పూజలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావిలోని ముత్యాలమ్మ, ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బోనాల జాతర వేడుకల సందర్భంగా 60 వేల మంది వరకు భక్తులు బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. వేడుకల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవ నిర్వాహకులు పరికిబండ మోహన్, రాచమల్ల సంగీత్ నేతృత్వంలో నిర్వహించిన వేడుకల్లో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, సికింద్రాబాద్ కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశ్‌రావు, బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, అంబాల రాజేశ్వర్‌రావు, టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ ప్రత్యేక పూజలకు హాజరయ్యారు.

అడ్డగుట్ట డివిజన్‌లో..

అడ్డగుట్ట: బోనాల పండుగను పురస్కరించుకొని అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారంగేట్ ఏసీఎస్‌నగర్, సీ.డీ సెక్షన్‌లోని దేవాలయాల్లో అమ్మవార్లను కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ, బీఆర్‌ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, రామేశ్వర్‌గౌడ్, దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కంటోన్మెంట్ బోర్డు పరిధిలో..

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రసిద్ధి చెందిన బాలంరాయి శ్రీదేవి దండు మారమ్మ ఆలయంలో ఆదివారం ఈవో శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో శ్రావణమాస బోనాల జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి చేరుకుని వివిధ పూజ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి బోనాలు, నైవేద్యం సమర్పించారు. రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు, మార్కెట్ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్ కుటుంబ సభ్యులు అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు.

ప్రముఖుల పూజలు..

కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్‌నాయక్ దంపతులు, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ క్రిశాంక్, రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జేల నాగేష్, బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, మమత దంపతులు, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్ విద్యావతి దంపతులు, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు భాగ్యశ్రీ శ్యాంకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీగణేష్, ముప్పిడి మధుకర్, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు.


ఫలహార బండ్ల ఊరేగింపులో కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ


అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వస్తున్న భక్తులు


అడ్డగుట్టలో..